క్లుప్తంగా

నియామకం



శీలా లోకనాథన్

తిరుపతి కల్చరల్: అవినీతి నిరోధక విజిలెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్ పర్సన్‌గా డాక్టర్ శీలా లోకనాథన్ నియమించినట్లు ఆ సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎం.శామ్‌ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి రహిత సమాజం, మహిళా సాధికారత, సమాజ సంక్షేమానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

వరద బాధితుల సహాయార్థం నెల జీతం ఇవ్వండి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి(అలిపిరి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు ఒక నెల జీతభత్యాలను, టీటీడీ, ప్రభుత్వ ఉద్యోగులు ఒక్కరోజు వేతనాన్ని ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులే కాకుండా టీటీడీ రూ.10 కోట్లు, శ్రీకాళహస్తి దేవస్థానం రూ. 5 కోట్లు కేటాయించి వరద బాధితులను ఆదుకోవాలన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో విజయవాడ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు వరద బాధితులకు అండగా నిలిచి ఆదుకోవాలన్నారు.

కరాటే పోటీల్లో తిరుపతి క్రీడాకారుల ప్రతిభ



అంతర్ జిల్లా కరాటే పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులు

తిరుపతి కల్చరల్: ఒంగోలులో ఆదివారం నిర్వహించిన అంతర్ జిల్లాల కరాటే పోటీలలో తిరుపతి క్రీడాకారులు ప్రతిభ చాటారని నవీన్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ నిర్వాహకుడు నవీన్ తెలిపారు. తమ సంస్థ తరఫున అండర్–7, అండర్ 19 విభాగాల్లో మొత్తం 70 మంది పోటీల్లో పాల్గొన్నారని, కటా విభాగంలో 8 మంది బంగారు పతకాలు, 10 మంది రజత, ఐదుగురు కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. వారిని అభినందించారు.

వివాదాస్పద భూముల ఉమ్మడి సర్వేకు సిద్ధం

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో కొద్దిరోజులుగా నెలకొన్న భూవివాద సమస్య పరిష్కారానికి అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి రెండు శాఖలు సంయుక్తంగా ఉమ్మడి సర్వే చేసేందుకు రికార్డులు సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన అటవీశాఖ అధికారులతో కలసి వివాదాస్పద భూముల వద్ద నిరసన తెలుపుతున్న బత్తలవల్లం దళితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి సర్వే నిర్వహించి భూ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అప్పటివరకు గ్రామస్తులందరూ సంయమనం పాటించి, సర్వేకు సహకరించాలని కోరారు. ఆరుగురితో కూడిన సర్వే బృందాన్ని సిద్ధం చేశామని, ఉమ్మడి చిత్తూరు కలెక్టరేట్‌లో ఈ భూములకు సంబంధించి కొన్ని రికార్డులు తెప్పించాల్సి ఉందని, అవన్నీ కూడా పూర్తిస్థాయిలో సేకరించి, పకడ్బందీగా గురువారం నుంచి సర్వే మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట అటవీశాఖ ఎఫ్ఎస్ఓ, ఇతర సిబ్బంది ఉన్నారు.

పక్కాగా ఇంటింటా సర్వే



ఇంటింటా సర్వే గురించి మాట్లాడుతున్న మౌర్య



రామచంద్రాపురం: నడవలూరులో ఇంటింటా సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

- తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి మౌర్య

తిరుపతి తుడా: ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు, తొలగింపు కోసం నిర్వహించే ఇంటింటా సర్వే పక్కాగా చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎస్.మౌర్య అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సర్వే నిర్వహణపై మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లకు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకే సర్వేకు పూనుకున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి ఏటా ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేకు 18రోజులు సమయం ఉందని, అందరూ సమన్వయం చేసుకుని పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరైనా మరణించారా? ఇల్లు మారారా? చిరునామా మార్పులు ఏమైనా ఉన్నాయా? అనే వివరాలు సేకరించాలన్నారు., కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి 18 ఏళ్లు నిండి ఉండాలని, కొత్త ఓటర్ నమోదుకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలను పరిశీలించాలని అన్నారు. సర్వేలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ఏదైనా తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: ఓటర్ల జాబితా పరిశీలనకు సంబంధించి సర్వే పారదర్శకంగా చేయాలని తహసీల్దార్ వెంకటరమణ బీఎల్వోలను ఆదేశించారు. మంగళవారం మండలంలోని నడవలూరు, నెన్నూరు దళితవాడల్లో చేస్తున్న ఇంటింటా సర్వేను ఆయన తనిఖీ చేశారు. నిష్పక్షపాతంగా ఓటర్ల పరిశీలన చేసి చనిపోయిన, వివాహమైన, డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓట్లను తప్పనిసరిగా తొలగించాలని ఆదేశించారు. 29వ తేదీ లోపు బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ఓటర్ల పరిశీలన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో వర్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోతో 'చవితి' మండపాలకు అనుమతి

–కమిషనర్ మౌర్య



ఉత్సవ కమిటీ కార్యాలయంలో పూజలు స్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి కల్చరల్: తిరుపతిలో గణేష్ మండప నిర్వాహకులకు అన్ని అనుమతులు సింగిల్ విండో విధానంలో పొందవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య అన్నారు. మంగళవారం ఇందిరా మైదానంలోని ఉత్సవ కమిటీ కార్యాలయంలో, గణేష్ మండప నిర్వాహకులకు నిమజ్జన మహోత్సవానికి చేయాల్సిన ఏర్పాట్లు, పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఫైర్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను కమిషనర్ అందజేశారు.

ఆమె మాట్లాడుతూ, నగరంలో వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు మట్టితో చేసిన వినాయకుని ప్రతిష్ఠించాలని కోరారు. పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఫైర్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను ఒకే చోట కూర్చుని అనుమతులు ఇచ్చేలా సింగిల్ విండో ద్వారా దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరంలో సినిమా పాటలు, రికార్డు డ్యాన్సులు, మత్తపదార్థాలు లేకుండా పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ అమరయ్య, ట్రాన్స్‌కో డీఈ వాసురెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాంగాటి గోపాల్‌రెడ్డి, మునికృష్ణ, వెంకటేష్, కరాటే శ్రీనివాస్, గుండాల గోపినాథ్, ఆకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంత పనిచేస్తివి ఇందిరా..!

- సభ్యులను ముంచేసిన డ్వాక్రా లీడర్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యురాలు కవిత

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట పరిధిలో డ్వాక్రా సంఘం లీడర్‌గా కొనసాగిన ఇందిర సంఘ సభ్యుల అనుమతి లేకుండా బ్యాంకు లోను పొంది ఇప్పుడు ఐపీ పెట్టిందని తమకు తెలిసిందని, ఆమె స్వాహా చేసిన నిధులపై విచారణ చేసి సంఘ సభ్యులకు న్యాయం చేయాలని వెంకటేశ్వర, సుబ్రమణ్యం సంఘాల సభ్యులు కవితి, చంద్రకళ, వాణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్లకు ముందు తమ సంఘాల్లో లీడర్‌గా ఉన్న ఇందిర ఇలా అందరినీ దగా చేస్తుందని అస్సలు ఊహించలేదని, తాము పొందని లోన్లకు డబ్బులు కట్టే పరిస్థితి తెచ్చి ఇందిర ముంచేసిందని వాపోయారు. ఆమె అక్రమాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘాల సభ్యులు సుబ్బలక్ష్మి, పార్వతి, దేవి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జి

పాకాల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీల బాధ్యత చాలా ఉందని ఎంఈఓ బాబ్జి అన్నారు. నూతనంగా ఎంపికైన పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామ సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడారు. మౌలిక వసతుల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించాలని, అలాగే మధ్యాహ్నం భోజనం పథకం అమలును పరిశీలిస్తూ ఉండాలన్నారు.వారి విధులు–బాధ్యతలను తెలియజేశారు. ఎంఈఓ–2 లింగయ్య, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పాపం ఎవరిది..?

- చంద్రగిరిలో ప్రాణాలు బలిగొంటున్న ప్రచార యావ..!
- గత ప్రభుత్వ హయాంలో ఫ్లెక్సీల కట్టడి
- కూటమి పాలనలో మొదలైన ఫ్లెక్సీల సందడి
- ఫ్లెక్సీ కడుతూ యువకుడు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- ఫ్లెక్సీలు కట్టడంపై మండిపడుతున్న పల్లెజనం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో కూటమి పార్టీల నేతల ప్రచార యావ తార స్థాయికి చేరుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తమ ప్రచార ఆర్భాటాలకు అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు కట్టించి పల్లెల్లో ప్రశాంతత లేకుండా చేయడమే కాకుండా అమాయకులను బలి గొంటున్నారనే విమర్శలు మూటకట్టుకున్నారు.

చట్టానికి తూట్లు...!

చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నేతలకు ఫ్లెక్సీలు కట్టరాదనే నిబంధనను గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కఠినంగా అమలు చేయించారు. అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పోలీసులకు నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా, ఏ పార్టీలైనా సరే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసే దిశగా ఆదేశించారు. ఫలితంగా ఫ్లెక్సీలు కట్టే సంప్రదాయం లేకుండా చేసి ప్రమాదాలకు పూర్తిగా చెక్ పెట్టారు. అయితే ఆ తరువాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా నే చంద్రగిరి కూటమి నేతల్లో ప్రచార యావ ఎక్కువైంది. విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ విష సంస్కృతి వల్ల పచ్చని పల్లెల్లో రాజకీయ కక్షలు, గొడవలు, ఊహించని ప్రమాదాలకు దారితీసేలా ఉంటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



మృతి చెందిన గోపి(ఫైల్)

ప్రాణం తీసిన ఫ్లెక్సీ...!

రామచంద్రాపురం మండలం అనుపల్లె పంచాయతీకి చెందిన గోపి, మధు రాయల్ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని సోమవారం తమ గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా మృత్యువు విద్యుత్ తీగల రూపంలో ఎదురైంది. ఫ్లెక్సీ కడుతున్న గోపి తలపై వున్న 11కేవీ విద్యుత్తు తీగలను గమనించకపోవడంతో కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించడం, అలాగే మధురాయల్ కింద పడటంతో తలకు తీవ్ర గాయాలై రుయా ఆస్పత్రి పాలవడం విదితమే. ఈ సంఘటనతో ఆ గ్రామంలో విషాదం అలుముకుంది. పంచాయతీ అధికారులు నిబంధనలు అమలు చేసి ఉంటే ఆ యువకుడు బలయ్యేవాడు కాదనే మాటలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు ఫ్లెక్సీల నిషేధిత నిబంధనలు కఠినంగా అమలు చేయాలని చంద్రగిరి ప్రజలు కోరుతున్నారు.

● చిమ్మచీకట్లో విధులు..!



అంధకారంలో కొత్తపేట సచివాలయం

- సచివాలయంలో వెలగని లైట్లు

చంద్రగిరి : విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో స్థానికకొత్తపేట సచివాలయ ఉద్యోగులు చిమ్మ చీకట్లో ఇబ్బందుల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్తపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఎదురుగా ఉన్న సచివాలయం కొన్ని రోజులుగా అంధకారంలో మగ్గుతోంది. దీనిమూలాన వివిధ సమస్యలను నివేదించేందుకు కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారు. మరోవైపు సిబ్బంది సైతం లైటింగ్ లేక ఇక్కట్లు పడుతున్నారు. విద్యుత్ సమస్యను ఎంపీడీఓ, పంచాయతీ ఈఓ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకూ పరిష్కరించకపోవడంతో అంధకార అగచాట్ల పర్వం కొనసాగుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

హస్తకళలపై అవగాహన అవసరం



విద్యార్థులు తయారు చేసిన హస్తకళలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ నారాయణ్మ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: సాంప్రదాయ హస్తకళలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ఎస్పీడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో హస్తకళలకు ఆధునికత జోడించి చిత్రించిన వస్తువులను ఆమె పరిశీలించి విద్యార్థినులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ, విద్యతో పాటు విద్యార్థినులకు హస్తకళల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీసి ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఉపాధి, ఉద్యోగావకాశాలను విద్యార్థినులు సులువుగా అందుకునేందుకు కళాశాల కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థినులు తయారు చేసిన గ్లాస్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, క్లేవర్క్ మొదలైన వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మి, హేమలత, ఉమారాణి, సాయికుమారి, శ్రీవాణి, నాగమణి, చెంచులక్ష్మి, వాణి ప్రశాంతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రమాదాలు నివారించండి

- తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్
- జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద ద్విచక్రవాహన తనిఖీలు



తిరుమలలో ద్విచక్రవాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుమల : ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించి ప్రమాదాలబారి నుంచి రక్షణ పొందాలని తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ వాహన చోదకులకు అవగాహన కల్పించారు. మంగళవారం సాయంత్రం జీఎన్‌సీ టోల్ గేట్ వద్ద ద్విచక్రవాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తిరుమల రెండు ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్రవాహన చోదకుడు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహన చోదకుడి ప్రాణాలను రక్షించడంలో హెల్మెట్ కీలకమని చెప్పారు. మొదటిసారి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఆ తర్వాత పర్యాయం జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అప్పటికీ వినని వాహన చోదకుల వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

పాకాల: ప్రజా ప్రతినిధులు, కమిటీ సభ్యులు పీహెచ్‌సీలలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ కోరారు. మంగళవారం పాకాల, దామలచెరువు పీహెచ్‌సీలలో పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పీహెచ్‌సీలో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, పాకాల పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, డాక్టర్లు రవిరామ్, ఎంపీడీఓ ప్రభాకర్, వైస్ ఎంపీపీ రహీం, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలంపై ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న రాయపేడు గ్రామస్తులు

తిరుపతి కల్చరల్: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేవీబీపురం మండలం శ్రీనివాసపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సి.మావిళయ్య చేసిన ఆరోపణలు అవాస్తవమని రాయపేడు గ్రామస్తులు రమేష్ చటర్జీ, ఏలుమలై, సురేష్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1962లో మావిళయ్య పూర్వీకులు లూథరన్ చర్చికి రాయపేడు లెక్కదాఖలా సర్వే నంబర్ 164/15లో 48 సెంట్ల భూమిని విక్రయించి రిజిస్టర్ చేయించారని తెలిపారు. అయితే ఇన్నాళ్లు ఆ స్థలం వద్దకు రాని మావిళయ్య 2019 నుంచి ఆ స్థలాన్ని తనకు చెందేలా చేయాలని ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల తప్పిదం మూలాన మావిళయ్యకు 1–బి అడంగల్‌లో పేరు నమోదైందని, దీనికి సంబంధించి 2019లోనే స్థలం వివాద వాజ్యం నడుస్తోందని తెలిపారు. స్థల రికార్డులను మార్చడంపై రెవెన్యూ అధికారులను కోర్టు ప్రశ్నించడంతో ..పొరబాటుగా నమోదైనట్లు అప్పటి తహసీల్దార్ శ్రీదేవి వివరణ ఇచ్చారని తెలిపారు. కోర్టు పరిధిలోనున్న భూవివాదాన్ని ఎమ్మెల్యేకు ఆపాదించడం సరికాదన్నారు. సమావేశంలో రాయపేడు గ్రామస్తులు థామస్, శివలింగం, దొరస్వామి, అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో ఏఈల ఖాళీలు భర్తీ చేయరూ!



సాంబశివరావుతో ఏపీఎస్ఈబీ అసోసియేషన్ నాయకులు

తిరుపతి రూరల్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఇంజినీర్ల ఖాళీలను భర్తీ చేయాలని ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. తిరుపతికి వచ్చిన రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి ఓఎస్‌డి సాంబశివరావును మంగళవారం ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షులు ఉయ్యాల రమేష్ బాబు, కార్యదర్శి పుల్లా బాలాజీ మాట్లాడారు. గత పే రివిజన్‌లో ఇంజినీర్లకు అన్యాయం జరిగిందని, భవిష్యత్తులో జరిగే పే రివిజన్లలో అన్యాయం జరగకుండా చూడాలని, ఇంజినీర్ల కోసం ప్రత్యేక పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. ఏఈల పోస్టులు ఎక్కువగా ఉన్నాయని, భర్తీ చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇంజనీర్ల కొరత తీవ్రంగా ఉందని తెలియజేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అయూబ్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, అసోసియేషన్ నాయకులు జయప్రకాష్, భాస్కర్ నాయుడు, స్వాతి, మునిప్రసాద్, వెంకటలక్ష్మి, రమేష్, బాలాజీ, రవి పాల్గొన్నారు.

కొయ్యబొమ్మ బంగారం





- జీఐతో భౌగోళిక గుర్తింపు ● టూరిజం వుడ్ హబ్‌గా ఏర్పాటుకు అవకాశం
- మాధవమాల బొమ్మను వరించనున్న పేటెంట్ హక్కు
- నాబార్డు ద్వారా అధ్యయనం

మాధవమాల కొయ్యబొమ్మ వార్తల్లోకి ఎక్కింది. అంతర్జాతీయ ఖ్యాతి గడించి, అందలమెక్కడానికి తొలి అడుగు పడింది. భౌగోళిక గుర్తింపు, పేటెంట్ హక్కు, వుడ్ హబ్ రూపకల్పన కోసం అధ్యయనం ప్రారంభమైంది. ఇందుకోసం న్యూఢిల్లీకి చెందిన రీసెల్యూట్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఆ గ్రామంలో పర్యటించి, బొమ్మలను పరిశీలన చేశారు. అన్నీ సవ్యంగా సాగి, అనుకున్నట్లు జరిగితే ఇక వందేళ్ల కొయ్యబొమ్మ బంగారం కానుంది.

ఏర్పేడు: మాధవమాల కొయ్యబొమ్మ అంతర్జాతీయ ఖ్యాతి పొందడానికి సన్నద్ధమవుతోంది. ఈ బొమ్మలకు భౌగోళిక గుర్తింపు కల్పించి, తద్వారా టూరిజం ఉడ్ హబ్‌గా ఏర్పాటుకు న్యూఢిల్లీకి చెందిన రీసెల్యూట్ సంస్థ ప్రతినిధులు మంగళవారం అధ్యయనం ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్స్ మ్యూచ్‌వలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను రిజిస్ట్రేషన్ చేయనున్నారు.

చరిత్ర 'వంద'నం

ఏర్పేడు మండలంలోని మాధవమాల కొయ్య బొమ్మలకు సుమారు వంద ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడి కళాకారులు సుమారు శతాబ్దకాలంగా కొయ్యబొమ్మలను తయారు చేస్తున్నారు. మాధవమాలలోని ఆచారి సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వందేళ్ల కిందట రైతులకు కొయ్య నాగళ్లు, పారలకు కొయ్యలు, చిన్నపాటి బొమ్మలు తయారు చేసి, ఇస్తుండేవారు. వారి మరణానంతరం వారి కుమారులు అదే వృత్తిని ఎంచుకున్నారు. ఈ క్రమంలో వారసులు సాంకేతిక పరిజ్ఞానంతో పలు దేవతా మూర్తులు, ధ్వజ స్తంభాలు తదితర కొయ్యబొమ్మలను తయారు చేసి, విక్రయిస్తుండేవారు. వారి వద్ద గుండరాయ నిమిట్ట, మాధవమాల ఎస్సీకాలనీ తదితర గ్రామాలకు చెందిన పలువురు కొయ్యబొమ్మల తయారీ నేర్చుకున్నారు.

బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీ ఏర్పాటు

2013లో బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్స్ మ్యూచ్‌వలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంస్థకు అధ్యక్షుడిగా లోకనాథం ఆచారి, కార్యదర్శిగా రాజాచారి, ప్రమోటర్‌గా కృష్ణమూర్తిని నియమించుకున్నారు. అప్పటి నుంచి కళాకారులు తయారు చేసిన బొమ్మలను ఈ సొసైటీ ద్వారా దేశ, విదేశాల్లో విక్రయిస్తూ లాభార్జన గడిస్తున్నారు.

జియోట్యాగింగ్‌కు అధ్యయనం

ప్రఖ్యాతి గాంచిన మాధవమాల కొయ్యబొమ్మలకు భౌగోళిక గుర్తింపు కోసం జియోట్యాగ్‌కు అధ్యయనం జరుగుతోంది. నాబార్డు ఆధ్వర్యంలో న్యూఢిల్లీకి చెందిన రీసెల్యూట్ సంస్థ జీఐ అధ్యయనం కోసం ముందుకు వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులు బాలాజీ వుడ్ కార్వింగ్‌ను పరిశీలించి సొసైటీ ప్రతినిధులు, కళాకారులతో జీఐపై అవగాహన కల్పించారు.



బాలాజీ వుడ్ కార్వింగ్‌లో తయారు చేసిన వివిధ దేవతా మూర్తుల బొమ్మలు

ప్రదర్శనలతో ప్రపంచఖ్యాతి

అప్పట్లో ఆర్థిక లేమి కారణంగా కళాకారులు కలప కొనుగోలు, పనిముట్ల విక్రయాల కోసం ఇక్కట్లు పడ్డారు. తాము తయారు చేసిన కొయ్యబొమ్మలను విక్రయించేందుకు పట్టణాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. కాలక్రమేణ అక్కడక్కడ పట్టణాల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తూ వచ్చారు. ఇలా కొయ్యబొమ్మలు ప్రపంచ స్థాయి ఖ్యాతి గడించాయి. కళాకారులు ఒక్కొక్కరు పట్టణాలకు వెళ్లలేక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

"

పేటెంట్, లీగల్ హక్కు



సొసైటీని జీఐ చేయడం ద్వారా ప్రొడక్ట్‌కు పేటెంట్, లీగల్ హక్కు కలుగుతుంది. ఎవరైనా నాణ్యతలేని బొమ్మలను విక్రయిస్తే వాటిని గుర్తించి ఆపడానికి అవకాశం ఉంటుంది. భౌగోళిక గుర్తింపు వస్తే మాధవమాల టూరిజం వుడ్ హబ్‌గా ఎదుగుతుంది.

– శ్రీవత్స మంగరాటి, ప్రతినిధి, రీసెల్యూట్ సంస్థ, న్యూఢిల్లీ